భానుడి భగభగ... 38.8 డిగ్రీలు

హైదరాబాద్ సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): భానుడి భగ..భగలతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మార్చి మొదటి వారంలోనే పలు ప్రాంతాల్లో 39 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సరూర్‌నగర్, కార్వాన్‌లో ఆదివారం అత్యధికంగా 38.8 డిగ్రీలు నమోదయ్యాయి. వారం రోజుల క్రితం గ్రేటర్‌లో 3,100 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైతే పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో 3,300 మెగావాట్లకు పెరిగింది. పగటి ఉష్ణోగ్రలతోపాటు రాత్రి ఉష్ణోగ్రత 24 డిగ్రీల వరకు నమోదవుతున్నది. మరో రెండురోజులు ఇదే తరహాలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఉపరితల గాలులు దక్షిణ/నైరుతి దిశలో గంటకు 4-8 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

చార్మినార్	38.4
బేగంపేట	38.7
సంతోష్‌నగర్	38.5
గోషామహల్	38.3
ఉప్పల్	38.3
కాప్రా	38.3
హయత్‌నగర్	38.0
ఎల్‌బీనగర్	37.9
మూసాపేట	37.7
రాజేంద్రనగర్	37.6
కుత్బుల్లాపూర్	37.6

సహజనటి జయసుధకు ఎక్సలెన్స్ అవార్డు


నటి జయసుధకు అవార్డు ప్రదానం చేస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

హైదరాబాద్ సిటీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఈస్ట్ వారు సినిమా, సంగీతం, వైద్య విభాగాల్లో ఇచ్చే ప్రతిష్ఠాత్మక వొకేషనల్ ఎక్సలెన్స్ అవార్డు (వృత్తిపరమైన సమర్థత పురస్కారం)ను సినీ నటి జయసుధ అందుకున్నారు. హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం జయసుధకు అవార్డు ప్రదానం చేశారు. సినిమారంగం నుంచి సహజనటి జయసుధ, నటుడు కాదంబరి కిరణ్‌కుమార్, సంగీతం నుంచి ప్రఖ్యాత ఈలపాట గాయకుడు ఎంవీ రమణారెడ్డికి, బయోకెమిస్ట్రీ నుంచి డా.సాయిపద్మకు ఈ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ఈస్టుకు చెందిన అధ్యక్షులు సుదేష్‌రెడ్డి, వొకేషనల్ సర్వీస్ డైరెక్టర్ సీవీ సుబ్బారావు, కార్యదర్శి టీఎంఎస్ చౌదరి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎల్లో రిబ్బన్ రన్


విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న అతిథులు

ఖైరతాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎండో మెట్రియాసిస్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ జరిగిన ఎల్లో రిబ్బన్ పరుగు చూపరులను ఆలోచింపజేసింది. ఎండో మెట్రియాసిస్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో దేశంలో తొలిసారిగా ఈ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ పీవీ నర్సింహారావు మార్గంలోని జలవిహార్ నుంచి సంజీవయ్యపార్కు వరకు, తిరిగి జలవిహార్ వరకు 3కె, 5కె రన్‌లు జరిగాయి. దీనిని అపోలో ఆస్పత్రి సీఈవో తేజస్విరావు ప్రారంభించగా, ఎన్ఎండీసీ డైరెక్టర్ వినయ్‌కుమార్, ఎల్ఐసీ అధికారులు జీవీబీ రామయ్య సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ వినీ బింద్రా మాట్లాడుతూ ఇది మహిళల్లో వచ్చే గర్భాశయ సంబంధిత వ్యాధి అని, ప్రపంచవ్యాప్తంగా 24 కోట్ల మంది మహిళలు దీనితో బాధపడుతుండగా దేశంలో 4.2 కోట్ల మంది అవస్థ పడుతున్నారని తెలిపారు. మహిళలు ప్రారంభదశలోనే చికిత్స చేయించుకునేలా చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అర్చనారెడ్డి, డాక్టర్ శ్వేతారెడ్డి, యువత పాల్గొన్నారు.

మెస్‌చార్జీలు, స్కాలర్‌షిప్‌లు పెంచాలి: ఆర్.కృష్ణయ్య


ధర్నాలో ఆర్.కృష్ణయ్య, తదితరులు

కవాడిగూడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పెరిగిన ధరల ప్రకారం రాష్ట్రంలోని ఎనిమిది లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ గురుకుల పాఠశాల విద్యార్థులతో పాటు 16లక్షల మంది కళాశాలల విద్యార్థుల మెస్‌చార్జీలను పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా కళాశాలలు, పాఠశాలల విద్యార్థుల మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్‌లను పెంచాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం నేత జిల్లపల్లి అంజి, గుజ్జ సత్యం ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సొంత భవనాల్లో 300 హాస్టళ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, బీసీ సంఘం నాయకులు రాజేందర్, అనంతయ్య, కృష్ణయాదవ్, నరసింహగౌడ్, రఘుపతి, వంశీ, మణికంఠ విద్యార్థులు పాల్గొన్నారు.

గృహజ్యోతి బిల్లుల జారీలో సమస్యలు..!

- వివరాలన్నీ సరిగా ఉన్నవారికే జీరోబిల్లులు

హైదరాబాద్ సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గృహజ్యోతి జీరోబిల్లుల జారీలో సమస్యలు తలెత్తుతున్నాయి. మార్చి 1న ఉదయం 6గంటలకే గృహజ్యోతి జీరోబిల్లుల జారీని విద్యుత్‌శాఖ ప్రారంభించినా రోజుకు ఎంతమందికి జీరో బిల్లులు జారీచేస్తున్నారనే వివరాలు మాత్రం వెల్లడించలేకపోతున్నారు. హైదరాబాద్ సౌత్‌సర్కిల్‌లోని పలుప్రాంతాల్లో ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల్లో వివరాలు సరిగా లేకపోవడంతో పలువురికి సాధారణ విద్యుత్‌బిల్లులు ఇస్తున్నారు. దరఖాస్తులో అన్ని వివరాలు సరిగా నమోదుచేసి ఉండి, విద్యుత్‌శాఖ స్పాట్ బిల్లింగ్ మెషీన్లలో వివరాల పరిశీలన పూర్తయిన గృహజ్యోతి లబ్ధిదారులకు మాత్రం జీరో బిల్లులు జారీచేస్తున్నారు. అయితే గృహజ్యోతి అర్హత కలిగి వివరాలు తప్పుగా నమోదైతే జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకొని వివరాలు సరిచేయించుకుంటే వారికి కూడా జీరో బిల్లులు జారీచేస్తామని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు.

హైకోర్టు ఉద్యోగుల క్రికెట్ మ్యాచ్ రన్నర్ టీఎస్ జట్టు

అమరావతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ హైకోర్టు ఉద్యోగుల మధ్య మంగళగిరి అంతర్జాతీయ స్టేడియంలో ఆదివారం క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఇరుజట్ల మధ్య హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఏపీ జట్టు 18 పరుగులతో విజేతగా నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన ఏపీ జట్టు 20 ఓవర్లలో 126 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తెలంగాణ జట్టు 108పరుగులకు ఆలౌటైంది. అంతకు ముందు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.జయసూర్య, జస్టిస్ సురేష్‌రెడ్డి, జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించారు. మ్యాచ్‌లో విజయం సాధించిన ఏపీ జట్టుకు ఏపీ హైకోర్టు ప్రోటోకాల్ రిజిస్ట్రార్ ఏవీ రాఘవస్వామి ట్రోఫీ అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన తెలంగాణ జట్టుకు ఏపీ హైకోర్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అక్కెన వేణుగోపాల్ కప్ అందించారు.

నేడు టీఎస్ఆర్టీసీ లక్కీడ్రా

చాదర్‌ఘాట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గతేడాది దసరా సందర్భంగా అక్టోబర్ 18 నుంచి 30వ తేదీ వరకు టీఎస్ఆర్టీసీ లక్కీ డ్రా బాక్స్‌లను బస్సుల్లో ఏర్పాటు చేసింది. సోమవారం ఎంజీబీఎస్‌లో డ్రా తీయనున్నట్లు రంగారెడ్డి రీజియన్ ఇన్‌చార్జి ఆర్ఎం బి.రాజు తెలిపారు. ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ శ్రీనివాస్ చేతుల మీదుగా రీజియన్ పరిధిలో 10 లక్కీ డ్రాలు తీయనున్నారని ఆయన తెలిపారు. ఇందులో ఐదుగురు మహిళలు, మరో ఐదుగురు పురుషులను ఎంపిక చేయనున్నారు. ఒక్కో విజేతకు రూ.9,900 నగదు బహుమతి ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నిమ్స్ వైద్యుల పరిశోధన పత్రానికి మొదటి బహుమతి


ప్రజ్వల్, ఉమామహేశ్వరరావు

హైదరాబాద్ సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో మార్చి 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించిన తెలంగాణ న్యూరో సైన్సెస్ 8వ వార్షిక సదస్సులో నిమ్స్ వైద్యులు ప్రజ్వల్, ఉమామహేశ్వరరావు సమర్పించిన పరిశోధన పత్రానికి మొదటి బహుమతి దక్కింది. తలకు గాయాలపాలైన రోగులపై ప్రొఫెసర్ డాక్టర్ ఎం.విజయ్ సారథి మార్గదర్శకత్వంలో వీరు పనిచేస్తున్నారు.


బాగ్‌అంబర్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న అంబర్‌పేట ఎమ్మెల్యే వెంకటేష్


గాంధీనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోలియో చుక్కలు వేస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ కార్పొరేటర్ ముఠా పద్మనరేష్


బాగ్‌అంబర్‌పేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోలియో చుక్కలు వేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ, టీపీసీసీ కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ తదితరులు


నల్లకుంట నర్సింహబస్తీలో పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ అమృత, బీజేపీ నేతలు కె.లక్ష్మణ్‌కుమార్, ఎం.శివకుమార్ తదితరులు

చుక్కల మందుకు చక్కని స్పందన

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఆయా ప్రాంతాలలో ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోలియో రహిత సమాజం కోసం తల్లిదండ్రులు 5 ఏళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కల మందు వేయించారు.

– ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ బృందం, ఆంధ్రజ్యోతి


అంబర్‌పేటలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్


నింబోలిఅడ్డ ఆరోగ్య కేంద్రంలో పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి


చిదంబరశాస్త్రిని సన్మానిస్తున్న నిర్వాహకులు

వాల్మీకి రామాయణమే ప్రామాణికం

చిక్కడపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి రచించిన ఇరవైనాలుగు వేల శ్లోకాలు ఉన్న రామాయణం పరమ ప్రామాణిక గ్రంథం అని అయోధ్య రామవిగ్రహ యంత్ర జప సంస్కార అనుష్ఠాన తపస్వి, ప్రముఖ ప్రవచనకర్త అన్నదానం చిదంబరశాస్త్రి అన్నారు. మానవధర్మం దేన్ని అనుసరించాలనే విషయమే రామాయణ మహాకావ్యం మూలమని ఆయన వివరించారు. త్యాగరాయగానసభలో ఆదివారం కాసలనాడు కుటుంబం మహర్షి అన్నదానం చిదంబరంశాస్త్రికి సత్కార సభ నిర్వహించారు. జర్నలిస్టు నాగవాణి, ఉపాధ్యక్షులు సూర్యకాంతం పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 115 మందికి పరీక్షలు

బర్కత్‌పుర, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాచిగూడలోని సాయికృష్ణ సూపర్ స్పెషాలిటీ న్యూరో ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత చెవి పరీక్షా శిబిరానికి రోగుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇఎన్‌టీ సమస్య ఎదుర్కొంటున్న రోగులు ఈ శిబిరంలో పాల్గొని ఉచితంగా వినికిడి పరీక్ష చేయించుకున్నారు. ఇఎన్‌టీ సర్జన్ డాక్టర్ శ్రేయమహేంద్ర, ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాంరెడ్డిలు రోగులను పరీక్షించారు. దాదాపు 115 మంది రోగులు ఈ వైద్య శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా ఉచిత చెవి పరీక్ష నిర్వహించామన్నారు.

నేడు యూపీహెచ్‌సీ నూతన భవనం ప్రారంభం

రాంనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) ముషీరాబాద్ ప్రధానరోడ్డులో నూతనంగా నిర్మించిన ముషీరాబాద్ పట్టణ ఆరోగ్యకేంద్రాన్ని సోమవారం ఉదయం 12 గంటలకు ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహ, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్, స్థానిక కార్పొరేటర్లు, వైద్యశాఖ ఉన్నతాధికారులు తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఆస్పత్రిని ఎస్ఆర్‌డిసౌజన్యంతో డా.దాట్ల విజయకుమార్‌ఫౌండేషన్ సహకారంతో నిర్మించారు.

రాజ్యసభనిదులు ఖర్చుచేస్తా..

ఎంపిగా ముషీరాబాద్‌అభివృద్ధికి పాటుపడతానని అనిల్‌కుమార్‌యాదవ్ తెలిపారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం అనిల్‌కు అభినందన సభ జరిగింది. అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ కార్యకర్తగా ఉంటూ 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడినుంచే పోటీచేశానని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికంగా ఎంపి సీట్లు గెలుస్తుందన్నారు. మాజీ కార్పొరేటర్లు కల్పనయాదవ్, వాజీద్‌హుస్సేన్, డి. కృష్ణ, అంజియాదవ్, పెండెంశ్రీనివాస్, హరికృష్ణతదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి

అంబర్‌పేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్‌లో చేపట్టే అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ అధికారులను కోరారు. చిలకమ్మబస్తీలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు లోక్‌సభ స్థానాలకు 'ఆప్' పోటీ

కవాడిగూడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నిల్లో ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్రంలో రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర శాఖ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. ఆదివారం దోమలగూడలో పార్టీ కార్యాలయంలో జూమ్ ద్వారా కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి ఘన విజయం సాధిస్తుందని, చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి పోటీకి సిద్ధంగా ఉన్నామని, ఈ విషయాన్ని అధిష్ఠానానికి తెలియజేశామన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవిచారి తదితరులు

డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను పూర్తిచేయాలి

రాంనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని సూర్యనగర్ బస్తీలో నిర్మిస్తున్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్ రవిచారి జలమండలి అధికారులకు సూచించారు. ఆదివారం ఆయన డివిజన్‌లోని సూర్యనగర్, బాగ్‌లింగంపల్లి ప్రాంతంలో పర్యటించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, సూర్యనగర్ బస్తీ అధ్యక్షుడు రవి తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌ను పరామర్శించిన రోహిత్‌చౌదరి

రాంనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురైన మాజీ ఎంపీ వి.హనుమంతరావును ఆదివారం బాగ్‌అంబర్‌పేటలోని ఆయన నివాసంలో ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రోహిత్ చౌదరి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.


జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా బీబీపాటిల్‌ను ప్రకటించడంతో ఛత్రపతి శివాజీ మహారాజ్ ఫౌండేషన్ చైర్మన్ సీ.డీ.చవాన్ ఆదివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాకప్పి జ్ఞాపికను బహుకరించారు -నల్లకుంట, ఆంధ్రజ్యోతి

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుపై హర్షం

రాంనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం చిక్కడపల్లిలోని సంఘం కార్యాలయంలో తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీచైర్మన్ బాల్‌రాజ్‌గౌడ్, రాష్ట్ర కన్వీనర్ వెంకన్నగౌడ్, వర్కింగ్‌చైర్మన్ విజయ్‌కుమర్‌గౌడ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్ గౌడ్, ఐలన్‌గౌడ్ పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న మహిళలతో సైబరాబాద్ డీసీపీ సాయిశ్రీ

సెల్‌ఫోన్ ద్వారా ఆర్థిక లావాదేవీలపై అప్రమత్తం

చిక్కడపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్‌ల ద్వారా ఆర్థిక లావాదేవీలు నిర్వహించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సైబరాబాద్ డీసీపీ సాయిశ్రీ సూచించారు. అసోసియేషన్ ఫర్ ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ సెటిల్డ్ ఎట్ హైదరాబాద్ ఉమెన్ వింగ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సిటీకల్చరల్ సెంటర్‌లో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముందస్తు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఆడిపాడి సందడి చేశారు. పోటీలలో ప్రతిభ కనబరచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైద్యులు డా.కౌసల్యచక్రవర్తి, డా.శ్రీలేఖ, అసోసియేషన్ ప్రధానకార్యదర్శి బుచ్చిరాజు, అనురాధ, శోభారాణి, జనార్దన్ పాల్గొన్నారు.

ఈస్ట్‌జోన్ డీసీపీ కార్యాలయంలో స్వల్ప అగ్నిప్రమాదం

అంబర్‌పేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : అంబర్‌పేటలోని ఈస్ట్ జోన్ డీసీపీ కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం స్వల్ప అగ్నిప్రమాదం సంభవించింది. మధ్యాహ్న సమయంలో షార్ట్ సర్క్యూట్ కలగడంతో ఇన్వర్టర్లు కాలిపోయాయి. సకాలంలో సిబ్బంది స్పందించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ముషీరాబాద్ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది డీసీపీ కార్యాలయానికి చేరుకుని మంటలను ఆర్పివేసి అదుపులోకి తీసుకువచ్చారు.

రేవంత్‌రెడ్డికి జాతీయ ఎంబీసీ సంఘాల సమితి కృతజ్ఞతలు

రాంనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై త్వరలో ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంపై జాతీయ ఎంబీసీ సంఘాల సమితి కన్వీనర్, తెలంగాణ రజక సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ట్యాంక్‌బండ్‌పై చాకలి ఐలమ్మ, సర్దార్ పాపన్న, దొడ్డి కొమరయ్య, శ్రీపాదరావుల విగ్రహాలు త్వరలో ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినందున ఆయన హర్షం వ్యక్తం చేశారు.

మున్సిపల్ కార్మికులపై వేధింపులను ఆపండి

గోల్నాక, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో మున్సిపల్ కార్మికుల పట్ల ప్రభుత్వం బయోమెట్రిక్ విధానాన్ని ఆసరాగా చేసుకుని వేధించడం సరైన విధానం కాదని, ఎవరో చేసిన తప్పుకు కార్మికులందరినీ వేధించడం సరికాదని బీఆర్‌టీయు రాష్ట్ర కార్యదర్శి నిరంజన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన గోల్నాకలో విలేకరులతో మాట్లాడుతూ.. కార్మికులను వేధించే విధానాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ కార్మికుల ప్రతినిధులు యాదయ్య, వీరస్వామి పాల్గొన్నారు.

శతాబ్ది లయన్స్‌క్లబ్‌కు 30 అవార్డులు

చిక్కడపల్లి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): లయన్స్ ఇంటర్నేషనల్ సమావేశంలో శతాబ్ది లయన్స్‌క్లబ్‌కు వివిధ విభాగాల్లో క్లబ్ సభ్యులు వ్యక్తిగతంగా మొత్తం 30 అవార్డులు అందుకున్నారు. ఆదివారం సికింద్రాబాద్ మారేడ్‌పల్లిలో జరిగిన సమావేశంలో పాల్గొన్న 17 క్లబ్బులలో చిక్కడపల్లికి చెందిన శతాబ్ది లయన్స్‌క్లబ్‌కు ముప్పై అవార్డులు రావడంతో క్లబ్ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. కాగా క్లబ్ పూర్వ అధ్యక్షుడు పేరి నాగేశ్వరరావుకు స్పెషల్ అప్రిసియేషన్ అవార్డును బహూకరించారు. క్లబ్ అధ్యక్షురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సిల్ట్ వెహికిల్స్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శిగా శ్రీనివాస్ నియామకం



ముషీరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సిల్ట్ వెహికిల్స్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శిగా ముషీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహలను మర్యాదపూర్వకంగా కలిశారు. వారు శ్రీనివాస్‌ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవి బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే ముఠాగోపాల్, అసోసియేషన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

చెరువులో మునిగి బాలుడి మృతి


అఫీస్ (ఫైల్)

ముషీరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): శుభకార్యానికి వెళ్లిన ఓ బాలుడు చెరువులో మునిగి మృత్యువాత పడడంతో భోలక్‌పూర్‌లో విషాదచాయలు అలుముకున్నాయి. భోలక్‌పూర్ సిద్దిక్‌నగర్‌కు చెందిన రుక్నుద్దీన్ కుమారుడు అఫీస్(14) ఆదివారం ఉదయం కర్ణాటకలోని మనేలి ప్రాంతంలో బంధువుల వివాహానికి వెళ్లాడు. స్నేహితులతో కలిసి స్థానికంగా ఉన్న చెరువులో స్నానం చేసేందుకు దిగాడు. నీటిలో పడడంతో అఫీస్ నీళ్లలో మునిగిపోయాడు. తోటిస్నేహితులు భయంతో చెరువులో నుంచి బయటకు పరుగులు తీసి స్థానికులకు సమాచారం ఇచ్చారు. దీంతో అఫీస్ కోసం నీళ్లలో వెతికి బయటకుతీశారు. అప్పటికే అఫీస్ మృతిచెందాడు. ఈ విషయం తెలిసిన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెన్నెల గద్దర్

కంటోన్మెంట్ బోర్డుకు 'టీపీటీ' నిధులు విడుదల

బర్కత్‌పుర, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డుకు ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ టాక్స్ (టీపీటీ) కింద 48 కోట్ల 53 లక్షల 88 వేల రూపాయల నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదలు చేసిందని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు వెన్నెల గద్దర్ తెలిపారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్రి అమరేందర్‌రెడ్డి, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జయప్రకాష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎం.గోపాల్‌తో కలిసి వెన్నెల గద్దర్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సర్వీస్ టాక్స్ కింద 800 కోట్ల రూపాయలు విడుదల చేయాల్సి ఉందని, దీనిపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ సర్వీస్ టాక్స్ నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయకపోతే ఎంపీ ఎన్నికల్లో కంటోన్మెంట్ ప్రజల ఓట్లు అడిగే నైతిక హక్కు బీజేపీకి లేదని ఆమె స్పష్టం చేశారు. కంటోన్మెంట్‌ను పూర్తిగా అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, పార్టీ ఆదేశిస్తే వచ్చే కంటోన్మెంట్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తానని ఆమె స్పష్టం చేశారు.

బహుజన సాంస్కృతిక విప్లవం రావాలి

రాంనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక విప్లవం కోసం అనేక సాహితీ సంస్థలు మాట్లాడుతున్నాయని కానీ బహుజన సాంస్కృతిక విప్లవం రావాల్సిన అవసరం ఉందని శరణం గచ్ఛామి సినిమా డైరెక్టర్ ప్రేమ్‌రాజ్, బహుజన సాహిత్య అకాడమి జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణలు అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన సాహిత్య అకాడమి (బీఎస్ఏ) తెలంగాణ 7వ రాష్ట్ర సదస్సు జరిగింది. అకాడమీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎం.గౌతమ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు నల్లారాధ కృష్ణ, ప్రేమ్‌రాజ్‌లు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో బీఎస్ఏ నేషనల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ విజయలలిత, మణిపూర్ రాష్ట్ర అధ్యక్షురాలు పంజేమ్‌బేమ్‌లనజిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

9న వీరభద్ర స్వామి ఆలయంలో అన్నదానం


పూజలు చేస్తున్న హైకోర్టు సీనియర్ న్యాయవాది కాసుల వినోద్

బర్కత్‌పుర, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 9న అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ శ్రీవీరభద్ర సేవా సమితి ప్రధాన కార్యదర్శి, హైకోర్టు సీనియర్ న్యాయవాది కాసుల వినోద్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 9న కురవిలోని వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఉదయం 7 నుంచే ఈ అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమంలో డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రనాయక్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు సాయికృష్ణ, విజయకుమార్, ఆనందరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టెట్ పరీక్ష ఉత్తీర్ణతలో ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ప్రభుత్వం న్యాయం చేయాలి

బర్కత్‌పుర, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల భర్తీ సందర్భంగా టెట్ పరీక్ష ఉత్తీర్ణతలో ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఓసీ సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు రామారావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 11 వేల 62 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేస్తున్నట్లు ప్రకటించిందని, అయితే టెట్ ఉత్తీర్ణత అర్హత పరీక్షలో ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 90 మార్కుల కటాఫ్ విధించారని, దీనిని 75 మార్కులకు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈడబ్ల్యూఎస్ 10 శాతం రిజర్వేషన్లను పూర్తిగా అమలు చేయాలని, అన్ని పరీక్షలలో పూర్తి స్థాయి రిజర్వేషన్‌లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఏపీ, తెలంగాణలో 42 ఎంపీ స్థానాలకు అభ్యర్థుల ఎంపిక

బర్కత్‌పుర, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలోని 523 ఎంపీ స్థానాలకు భారతీయ జవాన్ కిసాన్ పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. తెలంగాణలో 17, ఏపీలో 25 ఎంపీ స్థానాలలో తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు నారాయణ అంకుష్, ఉపాధ్యక్షుడు కె.ఎన్.నాయక్, జాతీయ కన్వీనర్ రాధాకృష్ణ, జాతీయ కార్యదర్శి సురేష్‌కుమార్, జాతీయ కో-ఆర్డినేటర్ ఎస్.మోహన్‌రావు, దక్షిణ భారత జోన్ కో-ఆర్డినేటర్ బంగారు కృష్ణమూర్తి, తదితరులు తెలిపారు.

వ్యాయామం ద్వారా ఆరోగ్యం, మానసిక ఉల్లాసం

చిక్కడపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వ్యాయామం ద్వారా ఆరోగ్యం, మానసిక ఉల్లాసం పెంపొందుతుందని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ అన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చొరవతో సీఎస్ఆర్ నిధులు రూ. 11 లక్షల అంచనా వ్యయంతో చిక్కడపల్లి వివేక్‌నగర్ పీపుల్స్ పార్కులో నిర్మించనున్న నూతన ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కార్పొరేటర్ ఆదివారం భూమిపూజ చేశారు. పీపుల్స్ పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీమా కంపెనీలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలి

రాంనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వరంగంలో ఉన్న నాలుగు బీమా కంపెనీలను విలీనం చేసి ఒకే సంస్థగా ఏర్పాటు చేయాలని ఆలిండియా ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జనరల్ ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ హైదరాబాద్ రీజియన్ 12వ రజతోత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ, న్యూ ఇండియన్ ఇన్సూరెన్స్ కంపెనీ, ఓరియెంటల్ ఇన్సూరెన్స్ యునైటెడ్ ఇన్సూరెన్స్ కంపెనీలు ప్రస్తుతం ప్రభుత్వరంగంలో పనిచేస్తున్న వీటిని ఒకే గొడుగు కిందకు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో ఆలిండియా ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జె.గురుమూర్తి, జనరల్ ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ హైదరాబాద్ రీజియన్ అధ్యక్ష కార్యదర్శులు బుచ్చిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, కోశాధికారి వి.ఎస్.ఎన్.మూర్తి పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేయాలి: టీఎస్‌యూటీఎఫ్

కవాడిగూడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఖజాన కార్యాలయాల్లో ఆమోదం పొంది ఆర్థిక శాఖ వద్ద రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్, జీపీఎఫ్, టీఎస్ జీఎల్ఐ, పీఆర్సీ డీఏ, పెన్షన్ బకాయిలు, సప్లిమెంటరీ జీతాలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో కె.జంగయ్య అధ్యక్షతన ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, ఉపాధ్యక్షులు సీ.హెచ్.రాములు, దుర్గాభవానీ, కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, కార్యదర్శులు సోమశేఖర్, రాజశేఖర్‌రెడ్డి, వెంకట్, గాలయ్య, సత్యానంద్ తదితరులు పాల్గొన్నారు.